## క్లుప్తంగా

### రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం

సత్తెనపల్లి: పురపాలక సంఘ పరిధిలోని 10వ వార్డు నాగార్జున నగర్‌లో ఈఎల్‌ఆర్‌ఎస్ ప్రధాన వాల్వ్ పాడై పోయిందని, కొత్త వాల్వ్ అమరుస్తున్న నేపథ్యంలో పట్టణంలోని 5వ వార్డ్ నుంచి 10వ వార్డు వరకు (నాగార్జున నగర్, క్రిష్టియన్ పేట, స్టేట్ బ్యాంక్) ఏరియాలో బుధవారం రక్షిత మంచినీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని మున్సిపల్ మేనేజర్ ఎస్.సాంబశివరావు సోమవారం తెలిపారు. ఆయా ప్రాంత పట్టణ ప్రజలు ముందుగా తగు నీటి నిల్వలు ఏర్పాటు చేసుకొని, పురపాలక సంఘానికి సహకరించాలని కోరారు.

### స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు



సత్తెనపల్లి: పట్టణంలోని పలు స్కానింగ్ సెంటర్లలో వైద్యాధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సత్తెనపల్లి ఇన్‌చార్జ్ వైద్యాధికారి డాక్టర్ ధర్మసింగ్ శాస్త్రి ఆధ్వర్యంలో స్కాన్ సెంటర్లు పీసీ, పీఎన్‌డీటీ చట్ట ప్రకారం పాటించాల్సిన నియమాలు తెలియజేసి, రిజిస్టర్లను పరిశీలించారు. రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు.

### నేడు, రేపు శిక్షణ తరగతులు

సత్తెనపల్లి: గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై మూడో బ్యాచ్‌కు శిక్షణ తరగతులు మంగళ, బుధ వారాల్లో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరుగుతాయని ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. విద్యుత్, సర్వేయర్, పశు సంవర్ధక శాఖల సహాయకులు, వీఆర్వోలు, మహిళా పోలీసులు తప్పనిసరిగా హాజరు కావాలని పేర్కొన్నారు. ఆధార్, దానికి లింక్ అయిన మొబైల్ నెంబర్ ఉన్న ఫోన్లను తీసుకురావాలన్నారు. బ్యాచ్-1, బ్యాచ్-2లో శిక్షణకు హాజరు కాని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఈ శిక్షణ తరగతులకు హాజరు కావాలన్నారు.

### గుండెపోటుతో వీఆర్‌ఏ మృతి



వేమవరపు ఆశీర్వాదం


పెదకూరపాడు: వీఆర్‌ఏ ఆశీర్వాదం(57) గుండె పోటుతో లగడపాడు గ్రామంలో సోమవారం మృతి చెందాడు. 40 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఆయన మంగళగిరి ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ చనిపోయారు. ఆశీర్వాదం మృతి తీరని లోటు అని తహసీల్దార్ మీసాలు దానియేల్ సంతాపం తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

### 20లోపు విచారణ పూర్తి చేయాలి



ముప్పాళ్ల: ఎన్నికల ప్రత్యేక సవరణ జాబితా ముసాయిదాలో భాగంగా అందిన అర్జీల విచారణ ఈ నెల 20లోపు పూర్తి చేయాలని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో సోమవారం సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా నూతన ఓటర్ల కోసం, ఓటరు జాబితాలో సవరణ కోసం అందిన అర్జీలన్నీ త్వరితగతిన విచారణ పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డీటీ సీహెచ్ లక్ష్మీ ప్రసాద్, ఆర్‌ఐ ఆంజనేయులు, ఆయా గ్రామాల బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

### జూనియర్ సివిల్ జడ్జి రోషన్‌కు అభినందనలు



సత్తెనపల్లి: మధ్య తరగతి కుటుంబానికి చెందిన షేక్ రోషన్ ఇటీవల జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన విషయం తెలిసిందే. జడ్జిగా ఎంపికైన షేక్ రోషన్‌ను స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సోమవారం ఆమె గృహానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. తల్లిదండ్రులు సుజాత, కరీముల్లాకు అభినందనలు తెలిపారు.

### మధ్యాహ్న భోజనం తనిఖీ



నకరికల్లు: నాణ్యత లోపించకుండా మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందించాలని ఎంఈఓ-2 ఎంఎల్ఎం ప్రసాద్ ఆదేశించారు. మండలంలోని రూపెన గుంట్లలోని ఎంపీయూపీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని సోమవారం పరిశీలించారు. వంటశాల, సరుకులను పరిశీలించారు. భోజనం రుచి చూశారు. విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. నాణ్యతపై నిఘా పెడతామని చెప్పారు. భోజనం నాణ్యతగా ఉందని అభినందించారు.

# భక్తిశ్రద్ధలతో ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం



వడ్డవల్లిలో పూజలు అందుకున్న శ్రీవారు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి



వడ్డవల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయం

- నియోజకవర్గ వ్యాప్తంగా ముస్తాబైన వైష్ణవాలయాలు
- తిరుప్పావై సేవా కాలాలు, గ్రామోత్సవాలు ప్రారంభం
- వచ్చే నెల 13న గోదా రంగనాథుల కల్యాణం

సత్తెనపల్లి: వేదాల్లో సామవేదం, మాసాల్లో మార్గశిరం అత్యంత పవిత్రమైనవని భగవద్గీత మనకు చెబుతోంది. ఈ మాసంలో రంగనాథుడిని పరమభక్తితో సేవించడం ద్వారా గోదాదేవి తన భక్తిని చాటుకుంది. సూర్యుడు వృశ్చిక రాశి నుంచి ధనుస్సు రాశిలోకి ఈ నెలలోనే ప్రవేశిస్తాడు. ఈ 30 రోజుల కాలాన్ని ధనుర్మాసంగా పిలుస్తూ, విష్ణువును ప్రసన్నం చేసుకునేందుకు గోదాదేవి రోజుకో రీతిలో తిరుప్పావై పాశురాలను ఆలపించడం విశేషం. అందరూ ఆచరించే భగవద్గీత పుట్టింది కూడా ఈ మాసంలోనే. నెలగంట మోగిందంటే గ్రామాల్లో హరిదాసుల సందడి ప్రారంభమైనట్లే.

**వైష్ణవాలయాల్లో తిరుప్పావై ప్రవచనాలు**

శ్రీ వైష్ణవులకు తిరుప్పావై వ్రతం ముఖ్యమైంది. ఈ వ్రతంలో నెలరోజుల పాటు రోజుకో పాశురం చొప్పున విన్నపం చేస్తారు. ఒకటి నుంచి ఐదు పాశురాలలో వ్రత విధానం. ఆరు నుంచి 15 పాశురాలలో తన తోటి చెలికత్తెలను నిద్రలేపి నంద గోపుని గృహానికి వెళ్లడం, 16, 17, 18 పాశురాలలో నందగోపుడు, యశోద, బలరాములను మేల్కొల్పడం, 23వ పాశురంలో మంగళ శాసనం, 25, 26 పాశురాలలో స్వామికి అలంకారాలైన ఆయుధాల్లో పరా అనే వాయిద్యాన్ని తమ శరణాగతి అనుగ్రహించి, తమ సంకల్పాన్ని నెరవేర్చమని ప్రార్థిస్తారు. ఆఖరి రోజున గోదా రంగనాథుల కల్యాణాన్ని అట్టహాసంగా నిర్వహిస్తారు.

**ఎంతో శుభప్రదం**

విష్ణుమూర్తికి ప్రీతికరమైన ఈ ధనుర్మాసం ఎంతో శుభప్రదమైనది. అన్ని విష్ణు ఆలయాలు, వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో నెలరోజుల పాటు తిరుప్పావై పాశురాలను పఠిస్తారు. ఈ మాసంలో విష్ణుమూర్తిని మధుసూదనుడిగా పూజిస్తారు. పెళ్లి కాని యువతులు ఇంటి ముందు ముగ్గులు, గొబ్బిళ్లతో పూజలు చేస్తే కోరుకున్న వరుడు దొరుకుతాడని ప్రతీతి. ఈ నెల రోజులూ శ్రీకృష్ణుడికి తులసిమాల సమర్పించే యువతులకు నచ్చిన వరుడితో వివాహం జరుగుతుందని పండితులు చెబుతున్నారు.

**ముస్తాబైన ఆలయాలు...**

నియోజకవర్గంలోని వైష్ణవాలయాలు ధనుర్మాస ఉత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. సోమవారం నెల పట్టడంతో శ్రీవారి ఆలయాల్లో ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఉత్సవాలు జనవరి 14 వరకు జరగనున్నాయి. నిత్యం ఆలయాల్లో మంగళ వాయిద్యాలు, తిరుప్పావై గానం, ఆండాళ్ కోవెల సేవలను నిర్వహిస్తారు. ప్రతి శుక్రవారం గోదాదేవికి కుంకుమార్చన చేస్తారు. ఈ నెల 17 నుంచి ఉత్సవాలు ముగిసే వరకు ప్రతిరోజు ఉదయం స్వామి, అమ్మవార్లు, అలాగే గోదాదేవికి గ్రామోత్సవాలను నిర్వహించనున్నారు. ఐదులాంతర్ల సెంటర్ లోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవాలయంలో జనవరి 13న భోగి పండుగ రోజు, జనవరి 16న వడ్డవల్లి శ్రీ రామాలయం శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం, రైల్వే స్టేషన్ రోడ్డులోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గోదా రంగనాథుల కల్యాణాన్ని అట్టహాసంగా నిర్వహించనున్నారు. ధనుర్మాసం సందర్భంగా వైష్ణవాలయాలలో భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించనున్నారు.

### ధనుర్మాస పూజలు ప్రారంభం



ప్రత్యేక అలంకారణలో వేంకటేశ్వరస్వామి

అచ్చంపేట: స్థానిక హరిహర క్షేత్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ధనుర్మాస పూజలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. సుప్రభాత సేవలతో ధనుర్మాస పూజలు ప్రారంభమయ్యాయి. అర్చక స్వామి వివిధ రకాల పూజా ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అష్టోత్తర, శత నామార్చనలు చేశారు. మహిళా భక్తులు తిరుప్పావై పాశురాలు పఠనం చేశారు. నెలరోజులపాటు ప్రతి రోజు ప్రత్యేకమైన పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

**భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు**

పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం ధనుర్మాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారిని శోభాయమానంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్ ప్రదీప్

అమరావతి: సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని సైబర్ క్రైమ్ కౌన్సిలర్ కొత్తపల్లి ప్రదీప్ పేర్కొన్నారు. సోమవారం ధరణికోట రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు డిగ్రీ కళాశాల విద్యార్థులకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు.. అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రదీప్ మాట్లాడుతూ ఆర్థిక, సామాజిక అంశాల్లో నేడు అధికంగా సైబర్ నేరాలు జరుగుతున్నాయని తెలిపారు. తొలి దశలో వీటిని అరికట్టటానికి ప్రతి ఒక్కరికీ సైబర్ నేరాలపై పూర్తి స్థాయిలో అవగాహన అవసరమన్నారు. వ్యక్తిగత వివరాలు, ఓటీపీలు చెప్పడం, సమాచారం ఇవ్వడం వంటివి చేయకూడదన్నారు. ఎస్‌ఐ రాజశేఖర్ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో మోసం జరిగిన వెంటనే సంబంధి శాఖకు, పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

# విశిష్ట సేవా పురస్కారాలు ప్రదానం



గీతాంజలి, పార్థసారథి దంపతులకు సన్మానం

సత్తెనపల్లి: ప్రతిభకు పేదరికం అడ్డుకారాదని వాసవి విజ్ఞాన జ్యోతి సత్తెనపల్లి గౌరవాధ్యక్షుడు డాక్టర్ వెలుగూరి సుబ్బరాయుడు అన్నారు. వెన్నాదేవిలోని వాసవి గార్డెన్స్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. విద్యను అభ్యసించడం ద్వారా ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చునన్నారు. ఎల్ఐసీ సత్తెనపల్లి బ్రాంచ్ మేనేజర్ జీవీఎస్ సురేష్ బాబు మాట్లాడుతూ ప్రతిభ కలిగిన పేద ఆర్యవైశ్య విద్యార్థులకు దాతలు సాయమందించడం అభినందనీయమన్నారు. ఆర్యవైశ్య విద్యార్థులు 45 మందికి ఉపకార వేతనాలు రూ.1.80 లక్షలు పంపిణీ చేశారు. చిత్ర కళారంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న వజ్రగిరి జస్టిస్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత శ్రీ రాఘవేంద్ర బాల కుటీర్ పాఠశాల హెచ్ఎం మిట్టపల్లి గీతాంజలి, విద్యా దాత ఏలూరుకు చెందిన మునగాల నాగ వెంకట మురళీకృష్ణను పూలమాలలు, దుశ్శాలువలతో సత్కరించి విశిష్ట సేవా పురస్కారాలను ప్రదానం చేశారు. వాసవి గార్డెన్స్ కళామందిరంలో గది నిర్మాణానికి రూ.లక్ష ఆర్థిక సహకారం అందించిన స్థానిక వ్యాపారి పోతుగంటి రామకోటేశ్వరరావును సన్మానించి, నూతన వస్త్రాలను బహూకరించారు. డాక్టర్ షకీలా శ్రీధర్, న్యాయవాది పక్కాల కామేశ్వరి, సత్తెనపల్లి శాఖ అధ్యక్షుడు ఏలూరి మురళీ, సెక్రటరీ జెమిలి రాధా కృష్ణమూర్తి, సభ్యులు త్రిపురమల్లు దేవిరాజ్యం, జెమిలి విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



బాగ్స్‌మెమోరియల్ సెంటినరి బాప్టిస్ట్ చర్చ్‌లో సెమీ క్రిస్మస్ కేక్ కటింగ్‌లో బాధ్యులు



నృత్య ప్రదర్శనలో సండే స్కూల్ చిన్నారులు

సత్తెనపల్లి: పట్టణంలో ఆదివారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాగ్స్ మెమోరియల్ సెంటినరీ బాప్టిస్ట్ చర్చ్ ఆవరణలో ఏసుక్రీస్తు జననాన్ని గుర్తు చేసుకుంటూ సంఘస్తులు పాల్గొన్నారు. సండే స్కూలు చిన్నారులు నృత్య ప్రదర్శనలతో అలరించారు. స్త్రీల సమాజం మధురమైన గీతాలు ఆలపించారు. క్రీస్తు పుట్టుక, సాయం చేసే చేతులు అనే రెండు లఘు నాటికలను యవనస్థులు అద్భుతంగా ప్రదర్శించారు. సంఘ కాపరి రెవరెండ్ జరుగుమల్లి ఇశ్రాయేలు వాక్యోపదేశం చేశారు. రెవరెండ్ డాక్టర్ గుజ్జర్లపూడి శరత్, తహసీల్దార్ కె.ఎస్.చక్రవర్తి, ఎస్‌ఐలు ఎం.సంధ్యారాణి, రవీంద్ర క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. సంఘ అధ్యక్షుడు గుజ్జర్లపూడి స్కైలాబ్, కార్యదర్శి కె.ఎం.ఆనిరాజ్, సంయుక్త కార్యదర్శి బంకా కిషోర్ బాబు, కోశాధికారి జి. రవిరాజు పాల్గొన్నారు.

- రెవ.డాక్టర్ విలియం కేరీ మెమోరియల్ స్వచ్ఛంద సేవా సంస్థ నేతృత్వంలో 8వ వార్డు క్రిస్టియన్ పేట కమిటీ సభ్యులు, పెద్దలు సెమీ క్రిస్మస్ వేడుకలను పరివర్తన ఆశ్రమంలో ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కేక్ కటింగ్ అనంతరం పాస్టర్ రవి కుమార్ ఏసు క్రీస్తు ప్రభువు జనన విశిష్టతపై దైవ సందేశం అందించారు. ప్రత్తిపాడు తహసీల్దార్ గుజ్జర్లపూడి కరుణ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రేమ విందు నిర్వహించారు. కమిటీ సభ్యులు గుజ్జర్లపూడి లాభాను, గుజ్జర్లపూడి మనోజ్ కుమార్, బంకా బాబురావు, గుజ్జర్లపూడి చిన్న కృపారావు, గుజ్జర్లపూడి యోహాను, గుజ్జర్లపూడి విజయ్‌కుమార్, కూచిపూడి ఫ్రాంక్లిన్ ఫిలిప్పు, బత్తిన రాంబాబు, మేకల విజయ్‌కుమార్, వినుకొండ రమేష్ బాబు, నేలపాటి కోటేశ్వర రావు, నేలపాటి వందనం ఉన్నారు.

# సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీవో

రాజుపాలెం: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలను సక్రమంగా రూపొందించుకుని, అమలు చేయడం ద్వారా సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించవచ్చునని ఎంపీడీవో జీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయం సిబ్బందికి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ అంశంపై సోమవారం శిక్షణ జరిగింది. ఈ శిక్షణలో ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో పేదరికం లేని మెరుగైన జీవనోపాధి కలిగి, ఆరోగ్యవంతమైన జీవనం గడిపేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎంఈవో మల్లికార్జునశర్మ, హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, ఏపీఎం శివకుమార్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఆర్కే రమాదేవి, ఆర్‌ఐ జానీ బాష ఉన్నారు.

# వ్యవసాయ కార్మికులకు వెంటనే 'ఉపాధి'చూపాలి



మాట్లాడుతున్న వంకాయలపాటి శివనాగరాణి

సత్తెనపల్లి: వ్యవసాయ పనులు లేక ఇబ్బంది పడుతున్న కూలీలకు ఉపాధి పనులను వెంటనే చూపాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వంకాయల పాటి శివ నాగరాణి డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా విస్తృత సమావేశం పట్టణంలోని పుతుంబాక భవన్‌లో జిల్లా అధ్యక్షుడు కారుచోల రోశయ్య అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా శివ నాగరాణి మాట్లాడుతూ మిర్చి కోతలు సరిగా ప్రారంభం గాక వ్యవసాయ కూలీలు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారికి వెంటనే ఉపాధి హామీ పనులను చూపాలని డిమాండ్ చేశారు. జిల్లాలో కేవలం 2,469 కుటుంబాలకు మాత్రమే 100 రోజులు పని పూర్తి చేయడం జరిగిందన్నారు. జిల్లాలో వ్యవసాయ కూలీలకు కూలి రూ.200 నుంచి రూ.350లు మాత్రమే ఇవ్వడం జరుగుతుందన్నారు. రూ. 500 కూలి లేకపోతే కుటుంబాలు గడవడం కష్టమవుతుందన్నారు. కనీస కూలి అమలయ్యే విధంగా అధికారులు ప్రచారం నిర్వహించాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంజిమాల రవిబాబు మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో వ్యవసాయ కూలీలు సాగు చేసుకుంటున్న పోరంబోకు, కుంట, చెరువు భూములకు పట్టాలు ఇచ్చే అవకాశం ఉంటే ఇవ్వాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఆఫీస్ బేరర్స్ జమాండ్లమూడి భగత్, కొమ్ముల నాగేశ్వరరావు, దుగ్గి సుజాత, సాతులూరి లూథర్, జడ రాజ్ కుమార్, షేక్ సాయిబా, మలినీడి నాగేశ్వరరావు, దాసరి అప్పారావు, బొల్లేపల్లి రామారావు, దాసరి పేతురు, ఏపూరి వెంకటేశ్వర్లు, బత్తుల బాలకోటయ్య, ఎన్‌వీ రాజు, కంచర్ల నాగేశ్వర రావు, కె.ముసలారెడ్డి, ఇశ్రాయేలు, పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ చట్టాలపై మహిళలకు అవగాహన



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న మల్లెల చిన్నప్ప

నకరికల్లు: ఎస్సీ, ఎస్టీ మహిళలు రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజనల్ కో ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప అన్నారు. డీబీఆర్‌సీ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ చట్టాలపై ఎస్సీ మహిళలకు సోమవారం నకరికల్లులోని ఎస్సీ కాలనీలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక ఎదుగుదలకు ప్రతి మహిళ డ్వాక్రా గ్రూపుల్లో చేరాలన్నారు. బాలికా విద్యపై దృష్టి సారించాలని సూచించారు. బాలికల అక్రమ రవాణా, పని ప్రదేశంలో మహిళా కూలీలకు ఇబ్బందులు, పోక్సో చట్టాల గురించి అవగాహన కల్పించారు. డీబీఆర్‌సీ ఏరియా కో ఆర్డినేటర్ గడ్డిపర్తి కోటిలింగం పాల్గొన్నారు.

# 120 మందికి ఉచిత కంటి పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

క్రోసూరు: స్థానిక పంచాయతీ ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి వైద్యులు ఉచిత కంటి వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఉప సర్పంచ్ షేక్ మస్తాన్ ప్రారంభించారు. కో-ఆర్డినేటర్ రవి మాట్లాడుతూ వైద్య శిబిరంలో 120 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు, ఐ డ్రాప్స్ అందజేసినట్లు చెప్పారు. వీరిలో 80 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశామని వెల్లడించారు. 30 మంది రోగులను కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు తెలిపారు. గుంటూరులోని కాకాణి శంకర కంటి ఆసుపత్రికి శస్త్ర చికిత్సల నిమిత్తం రిఫర్‌చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ ఆదినారాయణ, ఆప్తమాలజిస్ట్ కరుణశ్రీ, టెక్నీషియన్ రవి కాంత్ పాల్గొన్నారు.

### ఉచిత నైపుణ్య శిక్షణ

సత్తెనపల్లి: నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగుళూరులో కంప్యూటర్, టాలీ కోర్సుల్లో నైపుణ్య శిక్షణ, వంద శాతం ఉద్యోగ అవకాశం కల్పించడం జరుగుతుందని ఫౌండేషన్ అడ్మిషన్స్ కో-ఆర్డినేటర్ హరిప్రసాద్ సోమవారం తెలిపారు. టెన్త్ పాస్, ఇంటర్మీడియెట్, డిగ్రీ పాస్, ఫెయిల్ విద్యార్థులు 18-28 ఏళ్ల లోపు వయసు కలిగి ఉండాలన్నారు. 35 రోజుల శిక్షణ కాలంలో భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తారని చెప్పారు. శిక్షణలో టాలీ ప్లస్, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్, ఇంటర్వ్యూ స్కిల్స్ నందు ఉచితంగా శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. వివరాలకు 90004 87423 నంబరుకు సంప్రదించాలని చెప్పారు.

### క్రిస్మస్ స్టార్‌తో అభిమానం

అచ్చంపేట: మండలంలోని అంబడిపూడి ఎస్సీ కాలనీలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి అభిమానులు క్రిస్మస్‌స్టార్‌తో తమ అభిమానాన్ని చాటుకున్నారు. పెద్ద స్టార్‌పై వైఎస్‌జగన్ ఫొటో ఏర్పాటు చేశారు. క్రిస్మస్ పండుగ అయ్యేంత వరకు స్టార్ గుండ్రంగా తిరుగుతూ ఉండే విధంగా ఏర్పాట్లు చేశారు.

### 101 మద్యం బాటిళ్లు స్వాధీనం

అమరావతి: మండల పరిధిలోని జూపూడి గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లను సోమవారం అమరావతి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రెండు బెల్టు షాపులపై దాడి చేసినట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. గ్రామానికి చెందిన బత్తుల చిరంజీవి వద్ద 81 బాటిళ్లు, చెవల మధుసూదన రావు వద్ద 20 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

### చిత్తు బొమ్మ ఆడుతున్న ఐదుగురి అరెస్ట్

క్రోసూరు: మండల కేంద్రంలోని చెంచుకాలనీకి చెందిన ఐదుగురు చిత్తుబొమ్మ ఆడుతుండగా ఎస్‌ఐ కె.నాగేంద్రరావు, సిబ్బంది దాడి చేసి సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.3,810 స్వాధీనపరుచుకున్నట్లు వెల్లడించారు.

# నేటి నుంచి ఆధార్ నమోదుకు ప్రత్యేక క్యాంపులు

సత్తెనపల్లి: పట్టణంలో ఆధార్ నమోదుకు మంగళవారం నుంచి ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ మేనేజర్ ఎస్.సాంబశివరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని టీటీడీ కల్యాణ మండప సచివాలయంలో ఈ నెల 17, 18, 19, 20, 26, 27, 28 తేదీలు, 17న 10వ వార్డు నాగార్జున నగర్, 30వ వార్డు రైల్వే స్టేషన్ రోడ్డులోని అంగన్‌వాడీ కేంద్రాలు, 18న 15వ వార్డు పశువైద్యశాల వద్ద, 18వ వార్డు బండ్ల బజార్‌లోని అంగన్వాడీ కేంద్రాలు, 19న 19వ వార్డు సుందరయ్య కాలనీ, 23వ వార్డు యానాది కాలనీ అంగన్వాడీ కేంద్రాలు, 20న 27వ వార్డు ముస్లిం ఏరియా, 20వ వార్డు అంగన్వాడీ కేంద్రాలు, 26న కృష్ణవేణి, శాంతినికేతన్ జూనియర్ కళాశాలలు, 27న సుగాలి కాలనీ జెడ్పీ ఉన్నత పాఠశాల, ఎస్వీఆర్ డిగ్రీ కళాశాల, 28న ప్రగతి డిగ్రీ కళాశాల, 1వ వార్డు రంగా కాలనీ అంగన్వాడీ కేంద్రంలో క్యాంపులు జరుగుతాయన్నారు. సచివాలయ ఎడ్యుకేషన్, రెగ్యులేషన్ కార్యదర్శులు విధులు నిర్వహిస్తారన్నారు. క్యాంపుల్లో ఆధార్ బయో మెట్రిక్, ఆధార్ కార్డులో గల తప్పులను సరి చేసే ప్రక్రియను 100 శాతం పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని పుర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**గ్రామాల్లో..**

ప్రత్యేక ఆధార్ నమోదు క్యాంపులు సత్తెనపల్లి రూరల్ మండల పరిధిలో మంగళవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు, 26 నుంచి 28వ తేదీ వరకు రెండు విడతలుగా నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు విడతల్లో నందిగామ-1, నందిగామ-2, పాకాలపాడు గ్రామ సచివాలయాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కొత్తగా ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్‌డేట్, డెమోగ్రాఫిక్ అప్‌డేట్, డాక్యుమెంట్ అప్‌డేట్, 10 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఆధార్ జారీ చేయడం జరుగుతుందన్నారు. ప్రతిరోజు తప్పనిసరిగా ప్రతి ఒక్క ఆధార్ కిట్టు కూడా 100 సర్వీసులు అయ్యే విధంగా పంచాయతీ సెక్రెటరీలకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

# విద్య ద్వారానే పేద వర్గాల అభివృద్ధి



ఎస్సీ కాలనీలో దుస్తులు అందిస్తున్న సర్పంచ్ సతీష్, కార్డ్స్ సంస్థ ప్రతినిధులు

ముప్పాళ్ళ: పేద వర్గాలు విద్య ద్వారానే అభివృద్ధి చెందుతాయని కార్డ్ సంస్థ ప్రతినిధి ఎస్.పూర్ణకంటి ప్రజ్ఞచారి అన్నారు. ముప్పాళ్ల ఎస్సీ కాలనీలో బాలబాట డెవలప్‌మెంట్ ఆర్గనైజర్ల సమావేశం సోమవారం జరిగింది. సమావేశంలో పాల్గొన్న సంస్థ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ జి.సుబ్బారావు మాట్లాడుతూ విద్యకు దూరమైన పిల్లలను బాలబాట ద్వారా గురుకుల పాఠశాలల్లో చేర్పించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. ఏటా పది రకాల కూరగాయల విత్తనాలు తల్లిదండ్రులకు అందించి పెరటి తోటల పెంపకం ప్రోత్సహిస్తున్నామన్నారు. బాలబాట డెవలప్‌మెంట్ ఆర్గనైజర్లకు గ్రామ సర్పంచ్ మెడబలిమి సతీష్ చేతులు మీదుగా నెలవారి దుస్తులు అందించారు. ఈ కార్యక్రమంలో ఏరియా కో-ఆర్డినేటర్ మన్నం కోటేశ్వరరావు, మండల పరిధిలోని 30 మంది డెవలప్‌మెంట్ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

# సేంద్రియ ఉత్పత్తులు ఆరోగ్యానికి మేలు



స్టాల్‌ను ప్రారంభిస్తున్న తహసీల్దారు దానియేలు

పెదకూరపాడు: సేంద్రియ ఉత్పత్తులు ఆరోగ్యానికి మేలు చేస్తాయని తహసీల్దారు దానియేలు అన్నారు. సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద సేంద్రియ ఉత్పత్తుల స్టాల్‌ను ఆయన ప్రారంభించారు. గ్రీవెన్స్ సందర్భంగా దీనిని ఏర్పాటు చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఈ పంట ఉత్పత్తులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్టాల్ ఏర్పాటు చేసిన జెడ్పీ ఎస్ఎఫ్ స్టాఫ్ అమూల్య, ఉదయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి సోమవారం స్టాల్ ఏర్పాటు చేస్తామన్నారు.